క్లుప్తంగా

బోరు ప్రారంభం



బాటగంగానమ్మ లేఅవుట్ కాలనీలో నిర్మించిన బోరును ప్రారంభించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని బాట గంగానమ్మ లేఅవుట్ కాలనీలో నిర్మించిన బోరును ఆదివారం ప్రారంభించారు. ఎల్ఎస్ఎం మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ బోరును మినిస్ట్రీస్ సభ్యులు మల్లిపూడి దైవసహాయం ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ వైస్‌చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, పట్టణ అధ్యక్షులు పీపీఎస్ చంద్రరావు మినిస్ట్రీస్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో నాయకులు బత్తిన చిన్న, కౌన్సిలర్ సంకు సురేష్, సొసైటీ డైరెక్టర్ చిప్పాడ వెంకన్న, కంచర్ల విష్ణు, షేక్ రఫీ, ఊర్లపు నాగేశ్వరరావు, ఏటీఎం సత్యనారాయణ, మరడాని నాయుడు, చంద్రరావు కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదెల మృతి



మృత్యువాత పడ్డ పాడి గేదెలు

చింతలపూడి : మండలంలోని సీతానగరం గ్రామంలో విద్యుదాఘాతానికి గురై రెండు పాడి గేదెలు మృతి చెందాయి. వివరాల ప్రకారం గ్రామంలోని కోలా అప్పారావుకు చెందిన పాడిగేదెలు మేతకు తోలుకు వెళ్లాడు. రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సమీపానికి గేదెలు వెళ్లగా విద్యుత్ తీగలు తగలడంతో అవి మృత్యువాత పడ్డాయి. దీంతో గేదెల యజమాని లబోదిబోమంటున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్‌కు సరైన రక్షణ లేకపోవడం కారణంగానే లక్షన్నర ఖరీదు చేసే పాడి గేదెలు మృతి చెందాయని చెప్పాడు. విద్యుత్ శాఖాధికారులు తనకు న్యాయం చేయాలని కోరాడు.

పైపులైన్ ఏర్పాటుకు శంకుస్థాపన



పైపులైన్ల ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు

జంగారెడ్డిగూడెం రూరల్ : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని శ్రీనివాసపురంలో ఆదివారం మంచినీటి పైపులైన్ల ఏర్పాటు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ: 45 లక్షల నిధులు మంజూరయ్యాయని, ఈ పథకంలో భాగంగా పైపులైన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని సర్పంచ్ తెలిపారు. ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు, పోల్నాటి నాని, పత్తిపాటి రాజారావు, తానిగడప రాజశేఖర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు గ్రామోత్సవం



ముత్యాలమ్మ అమ్మవారు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ముత్యాలమ్మ అమ్మవారి తృతీయ వార్షిక వేడుకలు ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా ఆదివారం ఆలయం నుంచి గంగానమ్మ అమ్మవారి ఆలయం వరకు అష్టోత్తర కలశాలతో 108 సుహాసినిలతో అమ్మవారి పల్లకీ గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకులు కాజా ఫణిశర్మ, బొడ్డు సత్యనారాయణ గుప్త పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈమని శశికుమార్, ఆలయ నిర్మాణ కర్త భవిరిశెట్టి మురళీకృష్ణ, పదకుమారి దంపతులు, వగ్వాల పుల్లారావు దంపతులు, తమ్మ ఇంద్రాణి, రాజాన సత్యనారాయణ, కేఎల్ఎస్ ధనకుమార్, భవిరిశెట్టి రామాంజనేయులు, మద్ది ఆలయ ఈవో కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సరస్వతి పూజ



నూకాలమ్మ ఆలయంలో సరస్వతీ పూజ చేస్తున్న విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం విద్యార్థులచే సామూహిక సరస్వతీపూజ నిర్వహించారు. అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలో భాగంగా విశేష పూజలు నిర్వహించారు. వీరంపాలెం ఆధ్యాత్మిక సేవా ప్రతినిధి ఈమని శశికుమార్, ప్రధానార్చకులు యర్రమిల్లి మనోజ్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం సాందీపని విద్యకేంద్రం విద్యార్థులు భగవద్గీత పారాయణ చేశారు. సాయంత్రం నాలుగు మాడవీధుల్లో అమ్మవారికి ఊరేగింపు నిర్వహించారు.

అకాల వర్షంతో కుదేలు

- ఏజెన్సీలో దెబ్బతిన్న పంటలు
- నేలవాలిన మొక్కజొన్న, పొగాకు పంటలు
- పంట నష్టం అంచనా వేస్తున్న అధికారులు

బుట్టాయగూడెం : బంగాళాఖాతంలోని ఉపరితల ఆవర్తనం కారణంగా వాతావరణంలో వచ్చిన మార్పులతో గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఏజెన్సీ ప్రాంతంలో పలు పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా మొక్కజొన్న, మిరప, పొగాకు అధిక వర్షాలకు నీట మునిగాయి. అయితే ఆదివారం కొంతమేర తెరపు వచ్చి ఎండ కాయడంతో వ్యవసాయశాఖ అధికారులు నీట మునిగిన పంటలను పరిశీలించారు. అదేవిధంగా పంట నష్టం అంచనా వేశారు. కాగా బుట్టాయగూడెం మండలంలో మొక్కజొన్న 47.50 ఎకరాలు, నాటు పొగాకు 37 ఎకరాలు, మిర్చి 12 ఎకరాలు, వర్జీనియా పొగాకు 170 ఎకరాల వరకూ వర్షాల వల్ల దెబ్బతిన్నట్లు అంచనా వేశామని ఏఓ బి. సుమలత తెలిపారు. ఇదిలా ఉండగా వర్షాలు, తీవ్రమైన గాలులు కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్ల కొమ్మలు కూడా ప్రధాన రహదారుల మధ్యలో విరిగిపడ్డాయి. విరిగిన విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు వేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. రోడ్లకు అడ్డంగా విరిగిపడిన చెట్లను గ్రామస్తులు తొలగించారు.

నేలవాలిన పంటలు

జంగారెడ్డిగూడెం రూరల్ : ఈదురుగాలులు, వర్షానికి జంగారెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న, వర్జీనియా పొగాకు, నిమ్మ తోటలు నేలవాలాయి. ఎ.పోలవరం, తాడువాయి, మైసన్నగూడెం, చిన్నంవారిగూడెం, అక్కంపేట గ్రామాల్లో పంటలు నేలవాలాయి. 120 ఎకరాల్లో పొగాకు, 85 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు నేలవాలి నష్టం సంభవించినట్లు మండల వ్యవసాయాధికారి పోశారావు తెలిపారు. ఎ.పోలవరంలో 15 ఎకరాల్లో నిమ్మతోట వేళ్లతో సహా నేలవాలినట్లు మండల ఉద్యాన శాఖాధికారి ఎస్ ప్రసన్నలక్ష్మీ తెలిపారు.

మొక్కజొన్న రైతు కుదేలు

కొయ్యలగూడెం : అకాల వర్షాలకు రైతన్నలు కుదేలు అవుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఆదివారం ఉదయం మరొకసారి భారీ వర్షంతో మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్జినియా, మిరప, అరిటి, మామిడి, తోటలకు నష్టం వాటిల్లగా అధిక శాతం మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారి చెన్నకేశవులు పేర్కొన్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం 25 ఎకరాలలోని మొక్కజొన్న పంటకి బాగా నష్టం వాటిల్లిందని, పూర్తి అంచనా వర్షాలు అనంతరం పరిగణిస్తామన్నారు. ఈనేపథ్యంలో రైతులకు వ్యవసాయశాఖ అధికారుల చేత మిగిలి ఉన్న పంటరక్షణ చర్యల గురించి వివరిస్తున్నట్లు తెలిపారు. కాగా అకాల వర్షాల కారణంగా ఇటుక బట్టీలకు తీరని నష్టం వాటిల్లింది. ఓవైపు ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్లు, మరోవైపు భవనాల నిర్మాణం రూపొందుకున్న నేపథ్యంలో కరోనా కష్టాల వల్ల రెండు ఏళ్లుగా నిలిచిపోయిన ఇటుక పరిశ్రమలు పూర్వ వైభవం సంతరించుకున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాలు కురవడం వల్ల నష్టం వాటిల్లగా ఇప్పటికే తయారైన బట్టీలను కాపాడుకునే పనిలో నిర్వాహకులు తల మునకలై ఉన్నారు.



బుట్టాయగూడెం మండలంలో వర్షం, ఈదురు గాలులకు విరిగిపడ్డ విద్యుత్ స్తంభం



కన్నాయిగూడెంలో నేలవాలిన మొక్కజొన్న పంట



ఎ.పోలవరంలో నేలరాలిన వర్జీనియా పొగాకు



రౌతుగూడెం వద్ద విరిగిపడిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం



దెబ్బతిన్న పంటలను అంచనా వేస్తున్న వ్యవసాయ అధికారి



అంకాలగూడెంలో ఇటుక బట్టీలను కవర్లతో కప్పి ఉంచిన దృశ్యం

నేడు వాహనాల బహిరంగ వేలం

ద్వారకాతిరుమల : మండల పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ 9 మోటారు సైకిళ్లకు స్థానిక పోలీస్టేషన్ ఆవరణలో సోమవారం బహిరంగ వేలాన్ని నిర్వహించనున్నట్లు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆసక్తిగలవారు తమ ఆధార్ కార్డులతో పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

శ్రీవారి క్షేత్రానికి పాదయాత్రగా..



శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో పాదయాత్ర భక్తులు

ద్వారకాతిరుమల: మార్టేరు మండలం వనంపల్లిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయం వద్ద ఈనెల 17న పాదయాత్ర చేపట్టిన 80 మంది భక్తులు ఆదివారం చినవెంకన్న క్షేత్రానికి చేరుకున్నారు. దాదాపు 90 కిలోమీటర్లు మేర పాదయాత్ర చేసిన వీరంతా ముందుగా శ్రీవారు, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా పాదయాత్ర నిర్వాహకులు తోలేటి రాంబాబు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని, హిందూ మతాన్ని పెంపొందించడంతో పాటు, ప్రతీ ఒక్కరిలోనూ భక్తి భావాలు కలిగించేందుకు ఈ పాదయాత్రను చేపట్టినట్టు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఎస్ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

నిండా మునిగిన మిర్చి రైతు



తాట్కూరుగొమ్ములో తడిసిన మిర్చిని ఆరబెడుతున్న కూలీలు



పెద్దవాగు ఇసుకలో ఉన్న మిర్చిని ఒడ్డుకు మోస్తున్న రైతులు

వేలేరుపాడు : మూడు రోజుల పాటు కురిసిన వర్షాలు మిర్చి రైతుల్ని కోలుకోలేని దెబ్బతీశాయి. ఈ ఏడాది మిర్చికి మార్కెట్‌లో ధర ఆశాజనకంగా ఉండటంతో లాభాలు అధికంగా వస్తాయని భావించారు. కానీ వర్షాల వల్ల రైతుల కళ్లలో కన్నీరే మిగిలింది. గత నెల రోజులుగా ముమ్మరంగా మిర్చికోతలు కొనసాగుతున్నాయి. కోసిన కాయలు ఆరబోసి గ్రేడింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల పాటు కురిసిన వర్షానికి కళ్లాల్లో మిర్చి తడిసిపోయింది. కొంతమంది బరకాలు(టార్పాలిన్ కవర్‌లు) కప్పినప్పటికీ, కింది భాగం గుండా వర్షం నీరు ముంచేసింది. మండలంలోని రేపాకగొమ్ము, తాట్కూరుగొమ్ము, రుద్రమకోట, నడిగడ్డలు, పోచారం, తిర్లాపురం, చిగురుమామిడి, కట్కూరు, చిట్టంరెడ్డిపాలెం, కోయ మాధారం, మేడేపల్లి, కాచారం, కొయిదా, టేకూరు, బుర్రెడ్డిగూడెం, తదితర గ్రామాల్లో ఈ ఏడాది సుమారు మూడువేల ఎకరాల్లో రైతులు సాగుచేశారు. ఎకరాకు 20 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో 341, ఇనామ్ 5 ,తేజ రకాల మిర్చిని రైతులు ఎక్కువగా పండిస్తున్నారు. ఈ ఏడాది క్వింటా మిర్చి ధర రూ.22 వేల నుంచి రూ.27 వేలు పలుకుతుండటంతో రైతులు ఆనందపడ్డారు. రైతులు ఎకరానికి రెండు లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. ఈ సమయంలో అకాల వర్షం రైతుల పాలిట శాపమైంది. వర్షం వల్ల చెట్లకు ఉన్న మిర్చికి ఫంగస్ కూడా వచ్చి నాణ్యత తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. తడిసిన మిర్చి తాలు కాయలుగా మారి ధర పతనమయ్యే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరబెట్టిన మిర్చి పెద్దవాగు నీటిపాలు

వర్షానికి పెద్దవాగు ప్రాజెక్ట్ నిండిపోవడంతో ఆదివారం గేట్లు ఎత్తివేశారు. దీంతో పెద్దవాగు వెంబడి ఇసుకలో ఉన్న మిర్చి నీటి పాలైంది. వాగు వెంబడి ఉన్న పాతపూచిరాల, నడిగడ్డలు, రేపాకగొమ్ము, ప్రాంతంలో ఇసుకలో కొంతమంది రైతులు మిర్చిని ఆరబెట్టారు. ఒక్కసారిగా నీళ్లు రావడంతో మిర్చి కొంతమేరకు కొట్టుకుపోయింది.

తక్కువ ధరకు మిర్చి కొనుగోళ్లు చేస్తున్న దళారీలు

ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకున్న కొంతమంది దళారీలు రైతుల వద్ద శని, ఆదివారాల్లో మిర్చిని తక్కువ రేటుకు కొనుగోలు చేశారు. గుంటూరు మార్కెట్‌లో శనివారం క్వింటా ధర రూ.27వేల ఉంది. కానీ ఇక్కడి దళారీలు క్వింటా రూ.20 నుంచి రూ.23 వేలకే కొనుగోలు చేశారు. రాజమండ్రి, వేలేరుపాడు, కుక్కునూరుకు చెందిన కొంతమంది దళారీలు కల్లాల వద్దనే మిర్చిని కొనుగోలు చేశారు. రైతులు వర్షానికి భయపడి తక్కువ రేటుకే దళారీలకు అమ్ముకున్నారు.

60 క్వింటాళ్ల మిర్చి తడిసిపోయింది



నేను 10 ఎకరాల్లో మిర్చి సాగుచేసాను. ఎకరాకు రెండు లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టాను. ఇప్పటికి 50 క్వింటాళ్ల మిర్చి అమ్మాను. 60 క్వింటాళ్లు కల్లంలో ఉంది. ఇదంతా వర్షానికి తడిసిపోయింది. తీరని నష్టం వాటిల్లింది.

– కొమ్మరాజు రాంబాబు, రైతు తాట్కూరుగొమ్ము

వర్షం వల్ల తీరని నష్టం



నేను 20 ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. మూడు రోజుల పాటు కురిసిన వర్షానికి కల్లంలో మిర్చి పూర్తిగా తడిసిపోయింది. చెట్లకు ఉన్న కాయలకు ఫంగస్ వచ్చే ప్రమాదముంది.

– గడ్డె సుబ్బారావు, రైతు, తాట్కూరుగొమ్ము

దెబ్బతిన్న పంటల పరిశీలన



పొగాకు పంటను పరిశీలించిన జెడ్పీటీసీ బాబ్జి

జంగారెడ్డిగూడెం రూరల్ : ఈదురు గాలులతో కూడిన వర్షానికి మండలంలో నేలవాలిన పంటలను జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి పరిశీలించారు. ఎ.పోలవరంలో నేలవాలిన వర్జీనియా పొగాకు, మొక్కజొన్న, నిమ్మ తోటలను బాబ్జి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఏమేర పంట నష్టం జరిగిందనేది అంచనా వేస్తారన్నారు. ఆ నివేదికను ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యే ఎలీజాల దృష్టికి తీసుకెళ్లి రైతులను ఆదుకుంటామన్నారు. సర్పంచ్ బుద్దాల సీతారామరాజు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం రూరల్ : లక్కవరం శివారులో పేకాట స్థావరంపై ఎస్సై దుర్గా మహేశ్వరరావు తన సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. 8 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ:1530 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

నలుగురు జూదరుల అరెస్ట్

టి.నరసాపురం : సీతంపేటలో పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2,300 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : కె.అంకంపాలెం సమీపంలోని కోడిపందేల స్థావరంపై స్థానిక పోలీసులు దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వీరివద్ద నుంచి రూ.4,910 నగదు, ఒక కోడి పుంజు, ఒక కోడి కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న దృశ్యం

టి.నరసాపురం : వడగళ్ల వర్షానికి పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని జెడ్పీటీసీ సామంపూడి సూర్యనారాయణరాజు అన్నారు. తిరుమలదేవిపేటలో వడగళ్ల వర్షానికి, ఈదురుగాలులకు దెబ్బతిన్న, మొక్కజొన్న, నిమ్మ, పామాయిల్, అరటి, పొగాకు పంటలను తహసీల్దార్ సుబ్బారావుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట నష్టాలను అంచనా వేసి వెంటనే ప్రభుత్వానికి అధికారులు నివేదిక అందిస్తారన్నారు.

సమరశీల పోరాటాలకు సిద్ధంగా ఉండాలి



మార్కెట్ కమిటీ ఆవరణలో ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

చింతలపూడి : కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా సమరశీల పోరాటాలకు సన్నద్ధంగా ఉండాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వహణా అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో ఆదివారం చింతలపూడి ఏరియా ఏఐటీయూసీ ద్వితీయ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఏఐటీయూసీ పతాకాన్ని పట్నాల రామిరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఏరియా అధ్యక్షుడు కంకిపాటి బుచ్చిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చలసాని రామారావు మాట్లాడారు. దేశంలో 55 కోట్ల మంది అసంఘటిత కార్మికులు ఉండగా ఇంతవరకు సమగ్ర చట్టం రూపొందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. కార్మిక సమస్యలపై ఐక్య పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం వసంతరావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, కోకన్వీనర్ చాట్ల పుల్లారావు, జిల్లా సీపీఐ కౌన్సిల్ సభ్యులు టీవీఎస్‌రాజు, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి టి బాబు, సీనియర్ నాయకులు జంగా రామచంద్రారెడ్డి, మండల కార్యదర్శి కె.గురవయ్య, సహాయ కార్యదర్శి పి.సోమశేఖర్ తదితరులు ప్రసంగించారు.

అభివృద్ధి కమిటీ సమావేశం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం : శ్రీరామ నవమి సందర్భంగా శ్రీసీతారామస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు పట్టణంలో ఉన్న పేరంపేటలోని శ్రీసీతారామస్వామి (పెద రామాలయం) ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఆలయం వద్ద అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవమిని పురస్కరించుకుని నిర్వహించనున్న శ్రీసీతారామస్వామి కల్యాణంలో పాల్గొనదలచిన వారు ఆలయ కమిటీ ముందుగా తెలియజేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల కరపత్రాన్ని విడుదల చేశారు. ఎల్ఆర్ కృష్ణబాబు, ఎం.రామగోపాల్, ఎస్.సురేష్, జి.అనిల్, బీవీఎస్ నారాయణ, జి.నాగేశ్వరరావు, ఆర్.పెదబాబు, ఎం.శ్రీను. జె.ప్రసాద్ పాల్గొన్నారు.

కాపీ రైటింగ్ పుస్తకాల అందజేత

ద్వారకాతిరుమల : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ వారు మండలంలోని పంగిడిగూడెం జెడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం కాపీ రైటింగ్ పుస్తకాలను అందజేశారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు వీటిని అందించి చేతిరాతను వృద్ధి చేసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లీలాకుమార్ మాట్లాడుతూ చేతిరాత గుండ్రంగా ఉండాలంటే ప్రతి విద్యార్థి కాపీ పుస్తకాలు రాయాలన్నారు. తెలుగు పండిట్ ఎం.పెద్దిరాజు, మానవత మండల చైర్మన్ డి.ప్రభాకరరావు, మండల అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, పి.ఆనంద్‌కుమార్, కె.మధుసూదనరావు, కె.రుక్మిణినాథ్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఘటనపై ఎస్పీ విచారణ



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

జంగారెడ్డిగూడెం : జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులను పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన ఘటనపై విచారణ నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదివారం జంగారెడ్డిగూడెం వచ్చారు. స్థానిక అటవీశాఖ గెస్ట్ హౌస్‌లో విచారణ నిర్వహించారు. ముగ్గురు విద్యార్థులను, వారి తల్లితండ్రులను, ఉపాధ్యాయులు, హెచ్ఎంలను విడివిడిగా విచారించారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ ఘటనపై విచారణలో తేలిన అంశాలను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. 18 సంవత్సరాల లోపు చిన్నారులను స్టేషన్‌కు తీసుకురావడం తదితర అంశాలపై సిబ్బంది దిశా నిర్దేశం చేస్తామన్నారు. ఏదైనా ఘటనలు ఉంటే స్టేషన్‌కు సమాచారం ఇస్తే స్థానిక పోలీసులే పాఠశాల లేదా కళాశాలకు వెళ్లి విద్యార్థులకు వారి తల్లితండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. అయితే ఘటన జరిగిన సమయంలో స్థానిక పోలీసులు, మహిళా పోలీసులు ఇంటర్ పరీక్షల బందోబస్తు విధుల్లో ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి కలెక్టర్‌తో మాట్లాడి విద్యాశాఖాధికారులకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ పి.బాల సురేష్‌బాబు, ఎస్సై ఎం.సాగర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం



కమిషన్ చైర్మన్ అప్పారావు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్ ఘటనను రాజకీయం చేయవద్దని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 16న జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులను పోలీస్‌స్టేషన్‌లో ఉంచడంపై శనివారం కమీషన్ సభ్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ నిజనిర్ధారణ కోసం పాఠశాలకు వెళ్లారన్నారు. పోలీస్‌సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యాశాఖాధికారులతో జరిగిన ఘటనపై విచారణ నిర్వహించారన్నారు. దీనిపై పూర్తిస్థాయి సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక సోమవారం సాయంత్రంలోగా కమిషన్‌కి సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారులకు కమిషన్ ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. అధికారులు సమర్పించిన నివేదిక ప్రకారం బాధ్యులపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సభ

ద్వారకాతిరుమల: పదో తరగతి పాసైతే విద్యార్థి జీవితంలో తొలిమెట్టు ఎక్కినట్టేనని డీపాల్ స్కూల్ ఫాదర్ రాజు అన్నారు. మండలంలోని ద్వారకానగర్‌లోని డీపాల్ స్కూల్‌లో ఆదివారం తొమ్మిదవ తరగతి విద్యార్థులు, 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఫాదర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. వచ్చేనెల 3 నుంచి జరుగనున్న పరీక్షలను విద్యార్థులు బాగా రాయాలన్నారు. ఫాదర్ జోషి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.